క్లుప్తంగా

విద్యాలక్ష్మిగా మావుళ్లమ్మ



భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ప్రజల ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. బుధవారం విద్యాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విష్ణు కళాశాలలో ఫెస్టిన్ డే-ఫియూగో



విద్యార్థులతో మాట్లాడుతున్న వేణు, శ్రీనివాసరాజు తదితరులు

భీమవరం: భీమవరం పట్టణంలోని విష్ణు ఇన్స్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం విష్ణు స్టూడెంట్ సక్సెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఫెస్టిన్ డే-ఫియూగో నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు విద్యార్థుల్లో సృజనాత్మకత, అవుట్ ఆఫ్ దిబాక్స్ ఆలోచన, నూతన ఆవిష్కరణ మైండ్ సెట్, సంస్థాపక నైపుణ్యాలు అభివృద్ధి చెందడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో విష్ణు క్యాంపస్ స్టూడెంట్ సక్సెస్ సెంటర్ డైరెక్టర్ పి శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపల్ ఎం. శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష విరమణ

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కార్మికుడిని సస్పెండ్ చేయడం దారుణమంటూ డిపో ఎదుట ఎన్ఎంయూ నాయకులు చేపట్టిన దీక్షలను మంగళవారం విరమించారు. సస్పెన్షన్‌కు గురైన కార్మికుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో దీక్షలను ముగించినట్లు ఎన్ఎంయూ నాయకులు తెలిపారు.

సత్యేంద్రదాస్ మృతికి శ్రీనివాసవర్మ సంతాపం

భీమవరం: అయోధ్య శ్రీరామ మందిర ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్రదాస్ మృతి పట్ల కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సత్యేంద్రదాస్ 34 ఏళ్లుగా అయోధ్యలోని శ్రీరామ జన్మభూమిలో ఉన్న తాత్కాలిక ఆలయం నుంచి నేటి శ్రీరామ మందిరం వరకు శ్రీరాముని సేవలో నిమగ్నమై ఉన్నారన్నారు. సత్యేంద్రదాస్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దైవ చింతనతో ఉండాలి



చర్చి ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మండలంలోని ఎల్బీచర్ల గ్రామం బైనపాలెంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు లూథరన్ చర్చిను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మోషేన్‌రాజు, మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు తదితరులు మాట్లాడుతూ అందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

మూడు బుట్టల్లో చెత్తను సేకరించాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: తడి, పొడి, ప్రమాదకర చెత్తను మూడు బుట్టల్లో వేర్వేరుగా భద్రపరిచి ప్రజలు మున్సిపల్ సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. బుధవారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి చెత్తసేకరణను పరిశీలించారు. చెత్త సేకరించే సమయంలో దగ్గర ఉండి సిబ్బందికి సూచనలు చేశారు. చెత్త సేకరణలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని చెప్పారు. ప్రజలు కూడా చెత్తను వేర్వేరుగా అందించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఈ-పంట.. అన్నదాతకు అండ

మండలంలో 95 శాతం ఈ క్రాప్ నమోదు

భీమవరం అర్బన్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు, విపత్తుల సమయంలో ప్రభుత్వ సాయం పొందాలంటే ఎంతో ముఖ్యమైన ఈ-పంట నమోదును అశ్రద్ధ చేయకూడదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఈ -పంట నమోదును వ్యవసాయ సిబ్బంది పూర్తి చేస్తున్నారు. రైతులు త్వరితగతిన ఈ - పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

7,500 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు

మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, తుందుర్రు, కొవ్వాడ అన్నవరం, రాయలం, చినఅమిరం, అనాకోడేరు, కొమరాడ తదితర గ్రామాల్లో సుమారు 7,500ఎకరాలకు శ్రీకారం చుట్టారు. సాగులో ప్రయోజనాలను రైతులకు చేకూరే ఈ - పంట నమోదును వ్యవసాయ సిబ్బంది 95శాతం ఈ క్రాప్ నమోదు చేశారు. ఏటా భారీ వర్షాలు, తుఫాన్‌ల వల్ల కొన్ని ప్రాంతాల్లో సాగు దెబ్బతినడంతో రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకుంటే ఎంతో మేలు జరగడంతో పాటు రైతులు పండించిన ధాన్యాన్ని ఇబ్బందులు లేకుండా విక్రయించుకోవచ్చు.



తుందుర్రు గ్రామంలో ఈ-పంట నమోదు చేస్తున్న మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్

నమోదు ఇలా..

రైతులు తాము పండిస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవడానికి తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. సాగు చేసే భూమి విస్తీర్ణ, సర్వే నెంబర్లు వ్యవసాయ సహాయకులకు అందిస్తే వారు క్షేత్రస్థాయికి వచ్చి వివరాలను సరి చేసుకుని వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట వివరాలను నమోదు చేస్తారు.

నమోదు కాకుంటే..

రైతులు తాము పండించే పంట వివరాలను ఈ-పంట నమోదు చేయించుకోకపోతే పంట చేతికొచ్చిన తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉండదు. పండించిన ధాన్యం అమ్ముకోవడానికి దళారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. పంట చేతికొచ్చే సమయాల్లో అప్పుడపవుడు విపత్తులు సంభవించి పంట నష్టపోయే పరిస్థితులను రైతులు ఎదుర్కొంటూ ఉంటారు. అటువంటి విపత్తుల సమయాల్లో ఈ క్రాప్ నమోదు జరగకపోతే ప్రభుత్వం అందించే నష్ట పరిహారాలు అందవు. అలాగే పంటల బీమా వర్తించదు.

"ఈ -పంట నమోదుతో రైతులకు మేలు



రైతులు ఈ -పంట నమోదు చేయించుకోవడం ఎంత ముఖ్యమో అంతే ముఖ్యంగా ఈ కేవైసీ కూడా చేయించుకోవాలి. అప్పుడు మాత్రమే రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు, నష్టపరిహారాలు అందుతాయి. కౌలు రైతులకు గతంలో సాగు పత్రాలు ఇవ్వాలన్న నిబంధన ఉండేది. ప్రస్తుతం ఆ నిబంధనలు సడలించి క్షేత్రస్థాయిలో వాస్తవ సాగుదాలను గుర్తించి వారి పేరున ఈ-పంట నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఉండి: మండలంలో వ్యవసాయ భూమి కలిగిన రైతులంతా వారిపేర్లు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ(రైతు విశిష్ట సంఖ్య)లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి అని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరించే కార్యక్రమంలో భాగంగా, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) ఆధార్‌కార్డు తరహాలో రైతులకు అందించనున్నట్లు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు అందే పథకాలు, రాయితీలు పొందాలంటే రైతులకు ఈ విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మద్దతు ధర, పంట రుణాలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ ఎరువులు రాయితీ వంటివి పొందే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సొంత వ్యవసాయ భూములు కలిగిన వారికి మాత్రమే జరుగుతుందని, ఈ ప్రక్రియ ముగిసిన తరువాత కౌలు రైతులకు రిజిస్ట్రేషన్ చేస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్, 1-బి, ఆధార్ జిరాక్స్, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని స్పష్టం చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలి

ఉండి: మండల వ్యాప్తంగా అన్ని జిల్లా పరిషత్ ఉన్నతపా ఠశాలల్లో మరో నెలరోజుల్లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారులు జ్యోతి, వినాయకుడితో ఎంపీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి హైస్కూల్ పరిధిలో పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తమ ఫలితాలు రాబట్టాలని తెలిపారు. అలాగే పరీక్షలు కట్టుదిట్టంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ముందుండేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎంఈఓలు మాట్లాడుతూ అన్ని చర్యలు చేపట్టామని మరోసారి పరిశీలించి ఎక్కడైనా ఇబ్బందులుంటే వాటిని సరి చేస్తామని తెలిపారు.



ఎంఈవోలతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

సీఎంఆర్ బియ్యం సేకరించాలి

ఆకివీడు: రైతుల వద్ద సేకరించిన ధాన్యం తాలూకా బియ్యాని మిల్లుల వద్ద నుంచి సేకరించాలని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి గొంటా సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. స్థానిక అయిభీమవరం రోడ్డులోని శ్రీనివాస రైస్‌మిల్లులో ధాన్యం నిల్వలు, సీఎంఆర్ బియ్యాన్ని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లర్ సత్యనారాయణ మాట్లాడుతూ తమ వద్ద రెండు కన్‌సైన్‌మెంట్‌ల బియ్యం నిల్వ ఉందని తహసీల్దార్‌కు వివరించారు. బియ్యం సేకరణలో ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయిస్ అధికారులు దోబూచులాడుతున్నాయన్నారు. కన్‌సైన్‌మెంట్ అలాట్‌మెంట్ ఇస్తే బియ్యం చెల్లింపులు పూర్తి చేస్తామన్నారు. గోడౌన్‌లలో ధాన్యం నిల్వలు ఉన్నాయని, రబీ ధాన్యం వచ్చే తరుణం ఆసన్నమైందని ఆయన వివరించారు. సివిల్ సప్లయ్స్‌కి చెల్లించాలంటే వే బిల్లు వెంటనే ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్‌కు తెలియజేస్తామని తహసీల్దార్ చెప్పారు. స్టాక్ రిజిస్ట్రార్, గోడౌన్‌లను ఆయన పరిశీలించారు. తొలుత వివిధ కాఫీహోటల్స్, టీ స్టాల్స్‌లో గ్యాస్ సిలెండర్ వాడకాలను పరిశీలించారు. కమర్షియల్‌కు బదులు గృహఅవసరాల సిలెండర్లు వాడుతున్న ఐదుగురి వద్ద సిలెండర్లను స్వాధీనం చేసుకుని స్థానిక గ్యాస్ డీలర్‌కు అప్పగించామన్నారు. స్థానికంగా పలు చికెన్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి వస్తుండటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా చికెన్ సెంటర్లను తనిఖీచేసి, ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా చికెన్ అమ్మకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఆయా తనిఖీల్లో ఎస్సై హనుమంతు నాగరాజు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వంటపాటి ఆంజనేయులు పాల్గొన్నారు.



సీఎంఆర్ ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

పెరిగిన సోలార్ విద్యుత్ వినియోగం

ఆకివీడు: సోలార్ విద్యుత్ వినియోగం ఇటీవల కాలంలో పెరిగింది. సోలార్ విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనివ్వడంతో వివిధ యంత్రాల వినియోగానికి సోలర్ ప్యానెల్స్‌ను వినియోగిస్తున్నారు. వనరుల మీద నమ్మకంతో కాలుష్యాన్ని తగ్గించేందుకు, ముడి చమురును ఆదా చేసేందుకు, ఇంధనాల వాడకాన్ని తగ్గించేందుకు సోలార్ ప్యానల్స్ వినియోగం పెరిగింది. దీనిని వాడడం వల్ల ఇంధనం ధర తగ్గుతోంది. మండలంలోని కొల్లేరు తీరంలోని కాళింగగూడెంలోని ఆలయం వద్ద సెక్యూరిటీకి సోలార్ ప్యానల్‌తో పనిచేసే సీసీ కెమెరాను అమర్చారు. ఆ ప్రాంతంలో మద్యం తాగడం, దొంగతనాలు అరికట్టేందుకు సీసీ కెమెరాను స్థానికులు ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లో సోలార్ వినియోగం పెరుగుతుంది. వ్యవసాయ పంపుసెట్లు, గ్రైండర్లు, మిక్సీలు వంటి వాటికి కూడా సోలార్ ప్యానల్స్ వినియోగిస్తున్నారు. పలు చోట్ల రొయ్యల చెరువులకు భూగర్భ జలాలను తోడేందుకు, ఏరియేటర్ల తిప్పేందుకు సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.



కొల్లేరు తీరంలోని కాళింగగూడెంలో సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరా

రైతన్నకు డిజిటల్ గుర్తింపు

వీరవాసరం: రైతుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సందర్శించారు. మండలంలో జవ్వాది విష్ణుమూర్తి, జవ్వాది నాగవేణి, అను ఇద్దరు రైతులకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా స్వయంగా రిజిస్ట్రేషన్ చేసి గుర్తింపు నెంబరును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సంక్షేమ పథకాలు వర్తింప జేసేందుకు ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూమి కలిగిన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసి ప్రతి రైతుకు 11 అంకెలుతో కూడిన విశిష్ట సంఖ్యను మంజూరు చేయటం జరుగుతుందన్నారు. ఆధార్ నెంబర్ లింక్ అయిన మొబైల్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి వెళ్తే ఆన్లైన్లో వివరాలను నమోదు చేసి ఆధార్ కార్డు తరహాలో 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయించడం జరుగుతుందన్నారు. దీని ఆధారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేసే పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాలపై రాయితీ, పంట నష్టపరిహారం, తదితర పథకాలను రైతులు సులువుగా పొందవచ్చన్నారు. అనంతరం ఈ-పంట నమోదు చేసిన వాటిలో కొన్ని సర్వే నెంబర్లను క్షేత్రస్థాయిలో జిల్లా జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. గ్రామంలో త్వరితగతిన రీ సర్వే పూర్తి చేయండి అధికారులును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాస్, తహసీల్దార్ రామాంజనేయులు, మండల వ్యవసాయ అధికారి బిన్సీ బాబు, గ్రామ సర్పంచ్ కె .శాంతి ప్రియ, రెవెన్యూ వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యపురి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

జగనన్న కాలనీలో తహసీల్దార్ తనిఖీలు

ఆకివీడు: ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇల్లు కట్టుకుని ఉండకపోతే పట్టాలిచ్చేయాలని, అయితే పట్టా అమ్ముకున్నా, కట్టుకున్న ఇల్లు అద్దెకు ఇచ్చినా స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ ఎస్. వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలోని లబ్ధిదారుల ఇళ్లను, ఖాళీ స్థలాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంట్లో ఎవరు ఉంటున్నారు? అద్దెకు ఉంటున్నారా? సొంతంగా ఉంటున్నారా? పట్టా మీదేనా? లేక కొనుగోలు చేశారా? అంటూ ఆరా తీశారు. రికార్డుల ప్రకారం ఇళ్లలో ఎవరు ఉంటున్నారో? ఆధార్, రేషన్ కార్డులను తనిఖీ చేశారు. తనిఖీలో కొంతమంది తాపీ మేస్త్రీలు, టీడీపీ నాయకులు ఒకొక్కరూ నాలుగైదు ప్లాటులు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందికి ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు, డీటీ ఫరూక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుల ఇళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

రైతులకు యూనిక్ ఐడీపై అవగాహన

పెనుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు నేరుగా అందించడానికి రైతులకు యూనిక్ ఐడీపై అవగాహన కల్పించినట్లు ఆచంట మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు తెలిపారు. బుధవారం ఆచంట రైతు సేవా కేంద్రం రైతుల వివరాలు నమోదు చేసి, యూనిక్ ఐడీపై అవగాహన కల్పించారు. యూనిక్ ఐడీ ఉన్నవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు పంటల బీమా, పీఎం కిసాన్ యోజన , పంట నష్ట పరిహారం , అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీ లభిస్తుందని వివరించారు. ప్రతి రైతూ తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కు లింకైన ఫోన్ నంబరు వివరాలతో రైతు సేవా కేంద్రానికి వస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు.

విద్యుత్, మంచినీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలి

పాలకొల్లు అర్బన్: వేసవికాలం దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో మంచినీరు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం సునీల్ బాబు అధ్యక్షతన స్థానిక జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభివృద్ధి పనులపై సమీక్ష చేయకూడదని ఎంపీడీఓ ఎన్ఎన్ ఉమామహేశ్వరరావు సూచించారు. ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి వ్యక్తిగత కారణాలరీత్యా సమావేశానికి హాజరుకాలేక పోయారు. దీంతో వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ ప్రతిపక్ష నాయకుడు శాగ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ దోమల బెడద ఎక్కువగా ఉందని, దీనిపై అందరు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కోళ్లకు కొత్తగా బర్డ్‌ఫ్లూ వైరస్ వస్తున్నందున గ్రామంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు దీనిపై స్పందించి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అన్ని గ్రామాల్లో దోమల నివారణ డ్రైడే నిర్వహిస్తున్నామని, అలాగే ఎబెట్ దోమల మందు స్ప్రే చేయిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో కొంత కాలం పాటు చికెన్ తినడం మానేయాలని ప్రజలకు సూచించారు. వెటర్నరీ డా. వరప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా కోళ్ల సాధారణ వ్యాధులతో చనిపోతే గుంతలు తీసి పూడ్చిపెట్టాలని సూచించారు. బర్డ్‌ఫ్లూ వైరస్ సూచనలు లేవని, కొన్ని షెడ్లు తనిఖీ చేశానని, అలాగే శ్యాంపిల్స్ కూడా సేకరించి పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల్లో బర్డ్ ఫ్లూ లేదని నిర్ధారణ జరిగిందని వివరణ ఇచ్చారు.



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ఎన్ఎన్ ఉమామహేశ్వరరావు

రైతులు కొబ్బరి పల్లాలు తవ్వించుకోవాలి

జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతులు కొబ్బరి తోటల్లో కొబ్బరి చెట్ల చుట్టూ పల్లాలు తవ్వించుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ప్రజా ప్రతినిధులకు సూచించారు. ప్రతి గ్రామం నుంచి 25 ఎకరాలకు తగ్గకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి చెట్టుకీ రూ.120 ఉపాధి కూలీకి చెల్లిస్తారన్నారు. దీన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి సాయిబాబా, గెద్దం కుటుంబరావు, సర్పంచ్‌లు కడలి నాగమణి, కందుల వెంకటేశ్వరరావు, పంచదా వీర వెంకట నారాయణస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై దాడులు.. గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

నరసాపురం: సబ్సిడీపై గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు నిర్వహించారు. లక్ష్మీ అన్నపూర్ణ రెస్టారెంట్‌లో 3 హెచ్‌పీ కంపెనీకి చెందిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు, స్వాదిష్ట రెస్టారెంట్‌లో భారత్‌గ్యాస్ కంపెనీకి చెందిన 3 సిలిండర్లు స్వాధీనం చేసుకుని, రెస్టారెంట్ల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గృహవినియోగదారులకు సంబంధించిన సిలిండర్లు వాణిజ్య అవసరాలకు ఉపయోగించకూడదన్నారు.

భీమవరం ఆర్టీసీ డిపోలో సమస్యల తిష్ట

- లక్షల రూపాయల ఆదాయం ఉన్నా అభివృద్ధి శూన్యం
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): అధికారుల నిర్లక్ష్యం, నాయకుల తాత్సారం వెరసి భీమవరం ఆర్టీసీ డిపోలో సమస్యలు తిష్ట వేశాయి. లక్షల రూపాయల ఆదాయం వస్తున్న డిపో గ్యారేజ్‌లో సమస్యలు పరిష్కరించే నాథుడే కరువయ్యారు. బస్సుల మరమ్మతులు కూడా సక్రమంగా జరగడం లేదు. గతంలో ఆదాయం లేక ఆర్టీసీ నిర్వహణ ఇబ్బందిగా ఉండేది. కాని గత నాలుగేళ్లుగా ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తోంది. ముఖ్యంగా జిల్లాలో భీమవరం ఆర్టీసీ డిపో ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. గ్యారేజ్ నిధులు సమకూర్చడం లేదు. దాంతో గ్యారేజ్ సిబ్బంది, డ్రైవర్లు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

బస్సులను నాశనం చేస్తున్నారు:

భీమవరం డిపోకు సంబంధించి 74 బస్సులు ఉన్నాయి. వాటి మరమ్మతులు నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. బస్సులకు సంబంధించి ఏదైనా మరమ్మతులు జరిగినప్పుడు పాత వస్తువులనే వినియోగిస్తున్నారు. దీంతో బస్సుల ఫిట్‌నెస్ ప్రమాదకరంగా మారుతోంది.

పనిచేయని ఆర్వో ప్లాంట్



దెబ్బతిన్న ఫ్లోర్

బస్సుల రేడియేటర్‌లో డిస్టల్ వాటర్ పోయాలి లేకపోతే ఆర్వో వాటర్ పోయాలి. కాని ఆర్టీసీ బస్సుల్లో కలుషితమైన నీళ్లు రేడియేటర్‌ల్లో పోయిస్తున్నారు. దీంతో రేడియేటర్లు దెబ్బతింటున్నాయి. డిపోలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ చాలా కాలంగా పనిచేయడం లేదు. అక్కడ ఉన్న మున్సిపల్ వాటర్ తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. దాంతో నూతిలోని మట్టితో కూడిన మురికి నీళ్లు డంప్ చేసిన నీళ్లు కలుషితం అవుతున్నాయి. ఆ నీళ్లనే బస్సు రేడియేటర్లల్లో పోస్తున్నారు. ఇది అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

గ్యారేజీ సిబ్బందికి రక్షణ లేదు:

డిపో గ్యారేజ్‌లో పనిచేసే మెకానిక్, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి రక్షణ లేదు. బస్సుల మరమ్మతులు చేసే సమయంలో వారు రక్షణగా ధరించడానికి హెల్మెట్‌లు ఉండాలి, చేతికి రక్షణ వస్తువులు ఉండాలి, రాత్రులు బస్సులు లోపలకి వచ్చే సమయంలో డ్రైవర్లకు కనిపించేలా గ్యారేజ్ సిబ్బందికి రేడియం దుస్తులు ఉండాలి. కాని వారికి అవిఏమీ లేవు. ఇక మరమ్మతులు చేసే వద్ద ఫ్లోరు దెబ్బతినడంతో బస్సుల కింద జాకీలు పెట్టి పనిచేయడం ప్రమాదకరంగా మారింది. గ్యారేజ్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స చేసే సదుపాయాలు అందుబాటులో లేవు.



డిపో గ్యారేజ్‌లో పనిచేయని ఆర్వోప్లాంట్

ఆదాయం ఉండి కూడా అభివృద్ధిలో నిర్లక్ష్యం

ప్రజలు ఆర్టీసీ బస్సులను ఆదరిస్తున్నారు. సాధారణ రోజుల్లో పండగలు, యాత్రలు, దైవ దర్శనాలకు ఆర్టీసీ బస్సులను చక్కగా ఉపయోగించుకుంటున్నారు. దీంతో భీమవరం డిపోకు మంచి ఆదాయం వస్తుంది. సంక్రాంతి, ఇతర పండగల్లో అయితే రోజుల వ్యవధిలోనే రూ. 15 నుంచి 30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి డిపో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉంది.